## బతుకు బండి

నాతిచరామి అని పెళ్లి రోజు చేసుకున్న బాసలకు ప్రతిరూపం ఈ దంపతులు. బతుకు భారాన్ని పంచుకుంటూ నీకు నేను.. నాకు నీవు అన్నట్లు సాగుతున్నారు. సిద్దిపేట పాత బస్టాండ్ సమీపంలో భార్యాభర్తలు చెక్క పొట్టును రిక్షాలో ఇలా తీసుకెళ్తున్నారు. లోడు ఎక్కువగా ఉండడంతో వెనుక నుంచి భార్య రిక్షాను తోస్తూ బతుకు ప్రయాణానికి ఆసరా అయింది.

- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్



# ఈ సర్కారు బడిలో అడ్మిషన్‌కు తప్పదు పోటీ!

### ఇందిరానగర్ జడ్పీహెచ్ఎస్‌కు ఫుల్ డిమాండ్




ఇందిరానగర్ జడ్పీహెచ్ఎస్‌లో టాలెంట్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులు

సిద్దిపేట క్రైం, జూన్ 13 : ప్రైవేటు, కార్పొరేటు స్కూళ్లకు దీటుగా నిలుస్తున్నది ఓ సర్కార్ బడి. కొన్నేళ్లుగా ప్రతీ ఏటా అడ్మిషన్ ఫుల్ బోర్డుతో దర్శనమిస్తున్న జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ హైస్కూల్(జడ్పీహెచ్ఎస్)కు ఈ ఏడాది డిమాండ్ మామూలుగా లేదు. అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తే 645 అప్లికేషన్లు వచ్చాయి. దీంతో విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారిని తీసుకోవాలని నిర్ణయించారు. గురువారం పాఠశాల ఆవరణలో టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆరు, ఏడు తరగతులకు నాలుగు సెక్షన్లు, 8, 9, 10 తరగతులకు ఐదు సెక్షన్లు ఉన్నాయన్నారు. ఆరో తరగతికి 200 మంది విద్యార్థులను, 8వ తరగతికి 25 మంది విద్యార్థులను, 9, 10వ తరగతుల్లో ఖాళీలను బట్టి అడ్మిషన్లు తీసుకుంటామని తెలిపారు. టాలెంట్ టెస్ట్‌కు 645 మందికిపైగా హాజరయ్యారని, ఫలితాల కోసం ఒక కమిటీని ఏర్పాటు చేసి ప్రతిభ కనబరిచిన వారిని, ప్రభుత్వ పాఠశాలలో చదివిన, అనాథ పిల్లలు, దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

# విధేయులకు పట్టం

## నామినేటెడ్ పోస్టుల్లో వారికే పెద్దపీట




గజ్వేల్, జూన్ 13 : కాంగ్రెస్ పార్టీలో తమ విధేయులకే కీలక పదవుల్లో పట్టం కట్టనున్నారు. గజ్వేల్ నియోజకవర్గంలోని నామినేటెడ్ పదవులను తన అనుయాయులకు ఇచ్చేందుకు డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి నిర్ణయించినట్లు తెలిసింది. తన వెంట నిలిచిన, కష్టకాలంలో పార్టీ కండువాను వదలకుండా ఉన్న వారికి తగిన ప్రాధాన్యం కల్పించాలనుకుంటున్నారు. నామినేటెడ్ పోస్టులను వారికే ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించినట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. కొన్నాళ్లుగా పెండింగ్‌లో ఉన్న గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ, వంటిమామిడి మార్కెట్ కమిటీ, ఇప్పటి వరకు ఏర్పాటు కానీ కొండపాక వ్యవసాయ మార్కెట్ కమిటీలను భర్తీ చేసేందుకు కసరత్తు పూర్తి చేసినట్లు తెలిసింది. ఈ మేరకు ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖకు వివరాలతో కూడిన నివేదికను అందజేయనున్నట్లు సమాచారం. ఈ క్రమంలో నామినేటెడ్ పోస్టులపై ఆశలు పెంచుకున్న పలువురు నాయకులు నిరుత్సాహానికి గురికాగా, వారిని సముదాయించినట్లు తెలిసింది.

- గజ్వేల్, వంటిమామిడి, కొండపాక ఏఎంసీ చైర్మన్లు ఫైనల్
- త్వరలోనే అధికారిక ప్రకటన
- డైరెక్టర్ పోస్టుల్లోనూ వారికే గుర్తింపు

### గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నరేందర్‌రెడ్డి

గజ్వేల్, జగదేవ్‌పూర్, మర్కుక్ మండలంలోని పలు గ్రామాల్లో విస్తరించి ఉన్న గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి జగదేవ్‌పూర్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన వంటేరు నరేందర్‌రెడ్డికి దక్కనుంది. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జగదేవ్‌పూర్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా, గొల్లపల్లి సర్పంచ్‌గా పనిచేసిన ఆయన నర్సారెడ్డికి కీలక అనుచరుడిగా ఉన్నారు. కొండపోచమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ పోస్టును జగదేవ్‌పూర్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు, పీర్లపల్లి మాజీ సర్పంచ్ కేశిరెడ్డి రవిందర్‌రెడ్డి లేదా మండలంలోని దౌలాపూర్ గ్రామానికి చెందిన బంగార్‌రెడ్డికి ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే నరేందర్‌రెడ్డికి గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఫైనల్ చేయగా, వైస్ చైర్మన్‌గా మొదటి నుంచి పార్టీ కోసం పనిచేసిన గజ్వేల్ పట్టణానికి చెందిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్‌ను ఎంపిక చేశారు. ఇక డైరెక్టర్ల స్థానాల్లోనూ పార్టీ కోసం కట్టుబడి పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇచ్చేలా కసరత్తు చేస్తున్నారు.

### వంటిమామిడికి బాగనోళ్ల విజయ

ములుగు, వర్గల్, మర్కుక్ మండలంలోని పలు గ్రామాల పరిధిలో వంటిమామిడి మార్కెట్ కమిటీ విస్తరించి ఉంది. ఈ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్సీ మహిళకు రిజర్వ్ అయింది. మొదటి నుంచి పార్టీకి, నర్సారెడ్డికి మోహన్ విధేయుడిగా ఉండడంతో వారి వైపే మొగ్గు చూపినట్లు తెలిసింది. 2006 నుంచి 2011 వరకు వర్గల్ ఎంపీపీగా పనిచేసిన మోహన్ సతీమణికి చైర్మన్‌గిరి దక్కనున్నట్లు తెలిసింది. ఇక వైస్ చైర్మన్ పదవికి కొండపోచమ్మ ముంపు గ్రామమైన మామిడాలకు చెందిన కాంగ్రెస్ వాది గంగిశెట్టి ప్రభాకర్‌కు ఫైనల్ చేసినట్లు సమాచారం. ఇక డైరెక్టర్ల స్థానంలో మూడు మండలాలకు సమప్రాధాన్యం లభించేలా, పార్టీ కోసం పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇచ్చేలా ఎంపిక చేసినట్లు తెలిసింది.

### కొండపాకకు విరుపాక శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక వ్యవసాయ మార్కెట్ కమిటీ మొట్టమొదటి చైర్మన్‌గా విరుపాక శ్రీనివాస్‌రెడ్డి దాదాపుగా ఖరారైనట్లు తెలిసింది. కుకునూరుపల్లి మండలం మేధినీపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. 2013లో కోఆపరేటివ్ డైరెక్టర్‌గా పనిచేసిన ఆయన 2019లో ఎర్రవల్లి ఎంపీటీసీగా ఆయన భార్య ప్రణవిని కాంగ్రెస్ పార్టీ నుంచి నిలబెట్టి టీఆర్ఎస్ వేవ్‌లోనూ గెలిపించుకున్నారు. ఉమ్మడి కొండపాక మండల అధ్యక్షుడిగా 2014 నుంచి పనిచేస్తున్న ఆయన కుకునూరుపల్లి కొత్త మండలంగా ఏర్పడడంతో ప్రస్తుతం కుకునూరుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఈ మేరకు ఆయనకు నర్సారెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. వైస్ చైర్మన్, డైరెక్టర్ల ఎంపికను దాదాపుగా పూర్తి చేసినట్లు తెలిసింది.

### నాయిని యాదగిరికి బుజ్జగింపు

మొదటి నుంచి నర్సారెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా పనిచేస్తున్న టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ, గజ్వేల్ మాజీ ఉప సర్పంచ్ నాయిని యాదగిరి గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఆశించారు. ఈ క్రమంలో ఆయనను నర్సారెడ్డి పిలిచి ప్రత్యేకంగా బుజ్జగించినట్లు తెలిసింది. భవిష్యత్తులో మంచి స్థానాన్ని ఇస్తానని, జనరల్ స్థానం కావడం.. నరేందర్‌రెడ్డి సైతం పార్టీ కోసం పనిచేయడంతో ఆయనకు ఈసారి అవకాశం ఇద్దామని యాదగిరిని బుజ్జగించినట్లు తెలిసింది. ఇక కొండపాక మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సైతం కొంత ఆందోళన చేయగా, వారిని నర్సారెడ్డి సైలెంట్ చేసినట్లుగా తెలిసింది. ఈ క్రమంలో ఇప్పటికే ఫైనల్ చేసిన వారి పేర్లను అధికారికంగా వెల్లడించడమే తరువాయి అని కాంగ్రెస్ పార్టీ నాయకులు చెబుతున్నాయి.

## రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్‌స్పాట్ల గుర్తింపు

సిద్దిపేట క్రైం, జూన్ 13 : రాజీవ్ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ ఏసీపీ సుమన్ ఆధ్వర్యంలో గురువారం బ్లాక్‌స్పాట్లను గుర్తించారు. సిద్దిపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎస్ఐ వినయ్‌సాగర్, సిబ్బందితో కలిసి ఆయన సిద్దిపేట రాజీవ్ రహదారి పరిసర ప్రాంతాలను సందర్శించారు. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న కుంకుమ మిల్లు, రంగీలా దాబా, రాజీవ్ రహదారి సీఏఆర్ హెడ్‌క్వార్టర్, సిరిసిల్ల రోడ్డు రేణుక ఎల్లమ్మ టెంపుల్, ఓల్డ్ బస్టాండ్ అంబేడ్కర్ చౌరస్తాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ సుమన్‌కుమార్ మాట్లాడుతూ ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సైన్ బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, హెచ్చరిక సిగ్నళ్లు, ఇల్యూమినేషన్ టవర్ల ఏర్పాటుపై పోలీస్ కమిషనర్ ద్వారా ఆర్‌అండ్‌బీ, హెచ్‌కేఆర్ డిపార్ట్‌మెంట్‌కు నివేదికలు పంపిస్తామన్నారు.



రాజీవ్ రహదారిపై బ్లాక్‌స్పాట్‌ను సందర్శిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్


## అక్రమంగా తరలిస్తున్న 90 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

గజ్వేల్, జూన్ 13: అక్రమంగా తరలిస్తున్న 90క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గజ్వేల్ పోలీసులు, సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. గజ్వేల్ పట్టణంలోని తూప్రాన్ రోడ్డులో ఓ డీసీఎంలో చేర్యాల మండలం పెద్దరాజుపేట గ్రామానికి చెందిన నూనె మహేందర్ అనుమతి లేకుండా రేషన్ బియ్యాన్ని రవాణా చేస్తున్నాడన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి పట్టుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు.



పట్టుబడిన రేషన్ బియ్యం డీసీఎం


# ఇదేం నిర్మాణం!



మొదటి అంతస్తు పైకప్పు నుంచి లీకవుతున్న నీరు

- మల్లన్న క్యూ కాంప్లెక్స్ భవనం పైకప్పు క్యూరింగ్ వాటర్ లీకేజీ
- నూతన సాంకేతికతలో భాగమంటున్న ఇంజనీరింగ్ అధికారులు

చేర్యాల, జూన్ 13 : కొమురవెల్లి మల్లన్న ఆలయంలో భక్తుల సౌకర్యార్థం సుమారు రూ.11కోట్ల వ్యయంతో చేపట్టిన క్యూ కాంప్లెక్స్ భవనం నిర్మాణం పనుల నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చాన్నాళ్ల క్రితం పనులు ప్రారంభించినప్పటికీ నత్తనడకన కొనసాగుతున్నాయి. ఇటీవల మొదటి అంతస్తు స్లాబు నిర్మాణం పూర్తి చేయడంతో వాటర్ క్యూరింగ్ చేస్తున్నారు. ఈక్రమంలో డిజైనింగ్ లోపమో లేక మరేమిటో కానీ, ఓ చోట పైకప్పు నుంచి క్యూరింగ్ వాటర్ తరచూ ఉరుస్తుండటంతో భక్తులు, స్థానికులు విస్తుపోతున్నారు. ఇదే కాంట్రాక్టర్ గతంలో ఆలయ ముఖమండప విస్తరణ, ప్రసాద విక్రయ బుకింగ్ కార్యాలయ భవన నిర్మాణం పనులు చేయగా, కొన్నినెలలకే పగుళ్లపట్టి చిన్నపాటి చినుకులకే చెమ్మగిల్లి ఉరుస్తున్నాయి. దీనికితోడు క్యూకాంప్లెక్స్ నిర్మాణం పనుల్లో అదే ఒరవడి కొనసాగిస్తుండటం వివాదాస్పదమవుతుంది. కొన్ని నెలల క్రితం క్యూ కాంప్లెక్స్ భవనం గ్రౌండ్‌ఫ్లోర్ పనులు చేపట్టిన సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో పిల్లర్లకు పగుళ్లు వచ్చాయి. ప్రస్తుతం క్యూ కాంప్లెక్స్ మొదటి అంతస్తు స్లాబ్ వేయగా, పైకప్పునుండి నీరు ఉరుస్తుండటంతో మరోమారు అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈవిషయమై దేవాలయ ఇంజనీరింగ్ విభాగం ఏఈని వివరణ కోరగా బీమ్‌ల సైజు పెద్దగా కనిపించకుండా ఉండేందుకు నూతన సాంకేతికతతో పనులు చేస్తున్నామని, హైడ్రాలిక్ మిషన్ బిగించి వైర్లు సవరించడానికి గ్యాప్ పెట్టామని, వాటర్ క్యూరింగ్ కట్టలు లీకేజీ అవుతుండటంతో నీరు వస్తున్నాయని పేర్కొన్నారు.



భవనంపై నుంచి పడుతున్న లీకేజీ నీరు

# డీజిల్ దొంగలు దొరికారు!

### ఐదు పోలీస్ స్టేషన్‌లలో కేసులు

గజ్వేల్, జూన్ 13 : ఇటీవల ఐదు పోలీస్ స్టేషన్‌లలో డీజిల్ దొంగతనం కేసులు నమోదు కాగా నిందితులను పట్టుకున్నట్లు గజ్వేల్ పోలీసులు తెలిపారు. సీఐ బి.సైదా తెలిపిన వివరాల ప్రకారం.. మే 25న రాత్రి తూప్రాన్ రోడ్డులోని పెట్రోల్ బంక్ వద్ద నల్గొండ జిల్లాకు చెందిన లారీడ్రైవర్ మహమ్మద్ నిజాముద్దీన్ తన లారీని నిలుపుకోగా, గుర్తు తెలియని దుండగులు డీజిల్‌ను దొంగలించారు. దీనిపై గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే రోజు గజ్వేల్ మండలం శ్రీగిరిపల్లి గ్రామానికి చెందిన యశబోయిన బాలయ్యకు చెందిన లారీని ప్రజ్ఞాపూర్‌లోని లక్ష్మి పెట్రోల్ బంక్ వద్ద నిలిపి ఉంచగా, అందులోని డీజిల్ సైతం గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించినట్లు గుర్తించి గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతుండగా, గజ్వేల్ మండలం కోమటిబండ వద్ద ఈ నెల 11న వాహనాలను తనిఖీల్లో ఓ కారును ఆపారు. అందులో డీజిల్ క్యాన్లు, పైపు కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. కారును నడుపుతున్న డ్రైవర్ వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం గట్లఘనాపూర్ మధిర గ్రామమైన గోర్మిల తండాకు(ప్రస్తుత నివాసం మియాపూర్) చెందిన కేతావత్ శ్రీను(22)గా గుర్తించారు. అంగోతి తిరుపతి, అంగోత్ రాజ్‌కుమార్, సభావత్ రమేశ్, దేవేందర్‌సింగ్, మూడావత్ బాధ్య, మూడావత్ సురేందర్‌తో కలసి హైదరాబాద్‌లోని లాంగ్ డ్రైవ్ కార్లను అద్దెకు తీసుకుని రెండు నెలలుగా ఆయా పెట్రోల్ బంక్‌ల వద్ద డీజిల్ దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. చోరీ చేసిన డీజిల్‌ను కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి మహ్మద్ షరీఫ్(28), మహ్మద్ జహీర్(56)లకు తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయమై కేతావత్ శ్రీనుతో పాటు దొంగలించిన డీజిల్ అని తెలిసి కూడా కొనుగోలు చేసిన షరీఫ్, జహీర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. మిగిలిన నిందితులు అంగోతి తిరుపతి, అంగోత్ రాజ్‌కుమార్, సభావత్ రమేశ్, దేవేందర్‌సింగ్, మూడావత్ బాధ్య, మూడావత్ సురేందర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. అరెస్ట్ చేసిన వారి వద్ద నుంచి రెండు కార్లు, ఒక లారీ, రెండు డీజిల్ క్యాన్లు, నాలుగు సెల్‌ఫోన్లు, ఓ పైపును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సైదా తెలిపారు. డీజిల్ దొంగలను పట్టుకున్న ఇన్‌స్పెక్టర్లు బి.సైదా, ముత్యంరాజు, ఎస్ఐ శంకర్, పోలీస్ సిబ్బంది రవి, వెంకటేశ్, నరేశ్, నరేందర్, సంతోష్‌లను గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి అభినందించారు.



నిందితులను చూపుతున్న సీఐ సైదా

## ఓపెన్ స్కూల్ పరీక్ష ఫలితాలు విడుదల

సంగారెడ్డి అర్బన్, జూన్ 13 : ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో ఏప్రిల్, మే నెలలో పబ్లిక్ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. పదో తరగతి ఫలితాల్లో సంగారెడ్డి జిల్లాలో 2,181 మంది అభ్యర్థులు పరీక్ష రాయగా, 1736 మంది ఉత్తీర్ణులయ్యారు. 79.60 ఉత్తీర్ణత శాతం నమోదైంది. మెదక్ జిల్లాలో 458 మంది పరీక్ష రాయగా, 357 మంది ఉత్తీర్ణులు కాగా, 77.95 శాతం నమోదైంది. సిద్దిపేట జిల్లాలో 769 మంది పరీక్ష రాయగా, 328 మంది ఉత్తీర్ణులై, 42.65 శాతం నమోదైంది. ఇంటర్మీడియట్ ఫలితాల్లో సంగారెడ్డి జిల్లాలో 4022 మంది పరీక్ష రాయగా, 2696 మంది ఉత్తీర్ణులై, 67.03 శాతం నమోదైంది. మెదక్ జిల్లాలో 881 మంది పరీక్ష రాయగా, 530 మంది ఉత్తీర్ణులయ్యారు. 60.16 ఉత్తీర్ణత శాతం నమోదైంది. సిద్దిపేట జిల్లాలో 1057 మంది పరీక్ష రాయగా, 393 మంది ఉత్తీర్ణులు కాగా, 37.18 శాతం నమోదైంది. అభ్యాసకులు రీకౌంటింగ్ కోసం మీసేవ లేదా టీఎస్ ఆన్‌లైన్ ద్వారా 18 నుంచి 27 వ తేదీ వరకు చెల్లించాలని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. పూర్తి వివరాలకు కో ఆర్డినేటర్ 8008403635 నంబరును సంప్రదించాలని కోరారు.

## ఆస్తి కోసం కన్నతల్లిని కడతేర్చిన కొడుకుకు రిమాండ్

చిన్నకోడూరు, జూన్ 13 : ఆస్తి కోసం కన్న తల్లిని కొట్టి చంపిన ఘటనలో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట ఏసీపీ మధు తెలిపారు. గురువారం రాత్రి సిద్దిపేట ఏసీపీ కార్యాలయంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. చిన్నకోడూరు మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన అంతగిరి మల్లయ్యకు ఇద్దరు భార్యలు(సొంత అక్కాచెల్లెలు). మొదటి భార్య సత్తవ్వ(70)కు కుమారుడు చంద్రశేఖర్ ఉన్నాడు. అయితే, సత్తవ్వ పేరు మీద ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా దానిని తన పేరు మీద చేయాలని చాలా రోజులుగా చంద్రశేఖర్ తల్లితో గొడవపడుతున్నాడు. ఆ భూమి ఇద్దరు అక్కాచెల్లెలకు చెందుతుందని సత్తవ్వ చెప్పింది. సత్తవ్వను చంపితే ఆ భూమి తనకు దక్కుతుందని చంద్రశేఖర్ ఘాతుకానికి ఒడిగట్టాడు. 11న రాత్రి చంద్రశేఖర్ సత్తవ్వను తన బైక్‌పై సిద్దిపేటకు తీసుకెళ్తూ మార్గమధ్యలో రంగనాయకసాగర్ ప్రాజెక్టు సమీపంలోని హనుమాన్ ఆలయం వద్ద ఆపి గొడవ పెట్టుకున్నాడు. పట్టా చేయకపోతే చంపుతానని బెదిరించాడు. సత్తవ్వ ఒప్పుకోకపోవడంతో ఆమె తలను బైక్ హ్యాండిల్‌కు బలంగా గుద్దాడు. ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. హత్యని ప్రమాదకరంగా చిత్రీకరించాలని సత్తవ్వ మృతదేహన్ని బైక్‌పై గంగాపూర్‌లోని ఇంటికి తీసుకువచ్చాడు. అర్ధరాత్రి ఇంట్లో తల్లి సత్తవ్వ ప్రమాదవశాత్తు పడి గాయాలయ్యాయని ఆస్పత్రికి తీసుకెళ్లాలని ఇంటి పక్కవాళ్లతో నమ్మబలికాడు. 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు సత్తవ్వ అప్పటికే మృతి చెందిదని నిర్ధారించారు. భర్త మల్లయ్యకు అనుమానం వచ్చి మృతదేహన్ని పరిశీలించగా తల వెనకాల బలమైన గాయం కనిపించింది. కుమారుడే తన భార్యని కొట్టి చంపాడని మల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకోని విచారించారు. నేరాన్ని అంగీకరించడంతో నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

## నిబంధనలకు అనుగుణంగా పాఠశాలలను నడిపించాలి

**● నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్**

నర్సాపూర్, జూన్ 13: నర్సాపూర్‌లోని ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలకు అనుగుణంగా నడిపించాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అడ్డగోలుగా ఫీజులు వసూలు చేయొద్దన్నారు. అదేవిధంగా స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌ను ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ.. అనుభవజ్ఞులైన డ్రైవర్లచేత నడిపించాలని చెప్పారు. సామర్థ్యానికి మించి బస్సులో ఎక్కించొద్దని సూచించారు. అదేవిధంగా పాఠశాల ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటాలని తెలిపారు.

## చుక్క గుర్తు ఓటు వేయండి

**● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు**

సంగారెడ్డి రూరల్, జూన్ 13: చుక్క గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు కార్మికులను కోరారు. సంగారెడ్డి పట్టణ శివారులోని పోతిరెడ్డిపల్లిలో గల పెప్రీ పరిశ్రమ వద్ద గురువారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కులు సాధించేందుకు సీఐటీయూ నిరంతరం పోరాడుతుందని, ఎలాంటి సమస్యలు వచ్చినా కార్మికుల పక్షాన నిలబడి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, జీ.సాయిలు పాల్గొన్నారు.

## కేజీబీవీలో వాచ్‌మన్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

చిన్నశంకరంపేట, జూన్ 13: చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో నైట్ వాచ్‌మన్ పోస్టు భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ గీత గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునేవారు పదో తరగతి పాసై ఉండాలన్నారు. అర్హులైన వారు 16వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కేజీబీలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## 16న గజ్వేల్‌లో టీపీటీఎఫ్ విద్యా సదస్సు: అశోక్‌కుమార్

పుల్‌కల్, జూన్ 12: 'విద్యారంగ సంక్షోభం కర్తవ్యాలు-సంక్షోభంలో సామాజిక విలువలు' అనే అంశాలపై 16న తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) గజ్వేల్ జోన్ అధ్వర్యంలో విద్యా సదస్సు జరుగనున్నదని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్ కుమార్ తెలిపారు. గురువారం మండల కేంద్రమైన పుల్కల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యా సదస్సు పోస్టర్‌ను విడుదల చేశారు. టీపీటీఎఫ్ బాధ్యతలకు నిలబడి, హక్కుల కోసం కలబడుతుందని, ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యారంగ అభివృద్ధితో పాటు సామాజిక సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ గాజుల సుభాష్‌బాబు, పుల్కల్, చౌటకూర్ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు మన్నె జయకృష్ణ, బైండ్ల రామకృష్ణ, ఎం.శ్రీకాంత్‌గౌడ్, రవికుమార్, నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న అశోక్‌కుమార్

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నర్సాపూర్, జూన్ 13: మెదక్, నర్సాపూర్‌లోని మైనారిటీ గురుకులంలో పలు పోస్టులకు ఔట్ సోర్సింగ్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి జమ్లానాయక్ పేర్కొన్నారు. నర్సాపూర్ మైనార్టీ గురుకులంలో పీజీటీ ఉర్దూ, ఇంగ్లిష్, సోషల్, ఫిజిక్స్, టీజీటీ ఇంగ్లిష్ పోస్టులకు, అదేవిధంగా మెదక్‌లోని గురుకులంలో పీజీటీ ఫిజికల్ సైన్స్, మ్యాథమేటిక్స్‌లో జూనియర్ లెక్చరర్, సెక్యూరిటీ గార్డు పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు సంగారెడ్డిలోని ఆర్ఎల్‌సీ కార్యాలయంలో ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# నర్సరీపై బీజేపీ నేత ప్రతాపం

**భూమి డెవలప్‌మెంట్‌కు ఇవ్వలేదని..**

● అర్ధరాత్రి అనుచరులతో వీరంగం

● మొక్కలు ధ్వంసం.. స్థలం ఖాళీ చేయాలని బెదిరింపు

పటాన్‌చెరు, జూన్ 13: భూమిని డెవలప్‌మెంట్‌కు ఇవ్వలేదన్న కోపంతో ఓ బీజేపీ యువ నేత నర్సరీలో విధ్వంసం సృష్టించాడు. మొక్కలు ధ్వంసం చేసి, భూమి ఖాళీ చేయాలంటూ తన అనుచరులతో కలిసి బెదిరించాడు. పటాన్‌చెరు పరిధి ముత్తంగి గ్రామంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన వివరాలు బాధితుడి కథనం ప్రకారం.. మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ కుమారుడు, బీజేపీ యువనాయకుడు ఆశీష్‌గౌడ్ గ్రామంలోని సర్వేనంబర్ 454లో గడీల శ్రీనివాస్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, సాయికృష్ణ గౌడ్‌లకు చెందిన భూమిని తన రియల్ ఎస్టేట్ వ్యాపారంలో భాగంగా డెవలప్‌మెంట్‌కు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నాడు. వారు ఇందుకు నిరాకరించారు. అయితే, సదరు భూమిలో కొందరు నర్సరీ ఏర్పాటు చేసుకున్నారు. ఆశీష్‌గౌడ్ బుధవారం రాత్రి తన అనుచరులతో కలిసి ఆ భూమి వద్దకు వచ్చాడు. నర్సరీలోని మొక్కలను ధ్వంసం చేసి, నర్సరీ ఖాళీ చేయాలని బెదిరించాడు. ఈ మేరకు నర్సరీ యాజమాని, భూ యజమానులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



దాడిలో ధ్వంసమైన నర్సరీ

## నేషనల్ మీన్స్ కం మెరిట్‌కు
# నస్కల్ విద్యార్థిని సుహాసిని



నిజాంపేట, జూన్ 13: మండల పరిధిలోని నస్కల్ జడ్పీహెచ్ఎస్‌లో చదువుతున్న గుగులోత్ సుహాసిని నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. నగరం తండాకు చెందిన సుహాసిని 2023-24 సంవత్సరానికి గాను ఈ పథకానికి ఎంపికైంది. సుహాసిని జిల్లా నుంచి ఈ పథకానికి మూడో విద్యార్థిని అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తెలిపారు.

# శుచి లేదు.. శుభ్రత కానరాదు

● పుట్టగొడుగుల్లా హోటళ్లు, రెస్టారెంట్లు

● టిఫిన్ సెంటర్లు, స్వీట్ షాపుల్లోనూ..

● పట్టించుకోని ఫుడ్ సేఫ్టీ అధికారులు

మెదక్ కల్చరల్, జూన్ 13: మెదక్ పట్టణంలోని నితిన్ అనే వ్యక్తి భార్య టెట్‌లో అర్హత సాధించిన సందర్భంగా సంతోషంతో పట్టణంలోని అంబేడ్కర్ చౌక్‌లో గల బాలాజీ స్వీట్ హౌస్‌లో మిఠాయిలు కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లి తినిపించగా, వెంటనే వాంతులు అయ్యాయి. దీంతో ఆయన మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్ తమ సిబ్బందికి తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో సిబ్బంది స్వీట్ హౌస్‌లో తనిఖీలు నిర్వహించి శుభ్రత, నాణ్యత లేని స్వీట్లను స్వాధీనం చేసుకొని స్వీట్ హౌస్ యాజమానికి రూ. 5 వేల జరిమానా విధించారు. ఇలాంటివి పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇదొక్కటే కాదు... జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, బేకరీలు, స్వీట్ హౌస్‌ల్లో తినుబండారాల నాణ్యత ప్రశ్నార్థకంగా మారుతోంది. నోరూరించేలా కనిపించే ఈ పదార్థాల తయారీ వెనుక కనీసం శుచి, శుభ్రత ఏ మాత్రం ఉండటం లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. జిల్లా కేంద్రంతో పాటు, మండల కేంద్రాలలో, జనాభా ఎక్కువగా ఉన్న గ్రామాలలో, ప్రధాన కూడళ్లలో పుట్టగొడుగుల్లా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లు, తినుబండారాల దుకాణాలు వెలుస్తున్నాయి. అయితే, వీటిని కనీస నియంత్రణ, పర్యవేక్షణ.. తనిఖీలు లేకపోవడంతో యజమానులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. తాగునీరు, ప్లేట్లు, గ్లాసుల్లో శుభ్రత లేకపోవడం.. ఆహారపదార్థాల్లోనూ నాణ్యత లోపించడం, రుచి కోసం అధిక గాఢతతో కూడిన మసాలాలు, టెస్టింగ్ ఉప్పు, రంగులు వినియోస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

**ఎన్నో బ్రాండ్‌ల తాగునీరు...**

జిల్లాలోని హోటళ్ల, రెస్టారెంట్లు, ఇతర ప్రాంతాల్లో పలు బ్రాండ్ల తాగునీరు విక్రయిస్తున్నారు. లోకల్‌గా కుళాయి నీళ్లను పట్టి, బాటిళ్లలో నింపి విక్రయిస్తున్నా.. పట్టించుకునే పాపాన పోవడం లేదు. హోటళ్లలో వాడే కూరగాయలు, పండ్లు, మాంసం వంటి వాటి పై శుచి శుభ్రత మాట దేవుడెరుగు అన్న చందంగా ఉంది. పెద్ద హోటళ్ల నుంచి మొదలుకొని చిన్న తిను బండారాల వరకు తనిఖీలు చేయాల్సి ఉన్నా అవి ఎక్కడా కనిపించిన దాఖలాలు లేవు.



జిల్లా కేంద్రంలోని బస్ స్టాండ్ ఆవరణలో అపరిశుభ్రంగా ఉన్న ఫుడ్ సెంటర్

**మొక్కుబడిగా పర్యవేక్షణ...**

పట్టణాల్లో మున్సిపల్ అధికారులతో పాటు ఫుడ్ ఇన్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణ లేకపోవడం వినియోగదారులకు శాపంగా మారింది. ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సి పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. రోజుల తరబడి నిల్వ ఉంచడంతో పాటు నాణ్యత సరిగా లేనివి శుభ్రత లేని ఆహారం, వస్తువులతో అమ్మకాలు కొనసాగిస్తున్నారు. వీటితో పాటు మాంసాహారాల్లోనూ నాణ్యత ఉండటం లేదు. ఇటు వినియోగారుల నుంచి ఫిర్యాదులు లేకపోవడంతో అధికారులు సైతం స్పందించడం లేదు. పండగలు, ప్రత్యేక దావత్, ఆదివారాల్లో వినియోగం అధికంగా ఉన్నప్పుడు నాణ్యత, శుభ్రత అస్సలు ఉండటం లేదు.



స్వీట్ హౌస్‌ను తనిఖీ చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్

### నిరంతరం తనిఖీలు నిర్వహిస్తాం

వర్షాకాలం సీజన్ రావడంతో ప్రజల ఆరోగ్యం దృష్ట్యా గతం కంటే ఎక్కువగా తనిఖీలు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశించారు. ఇకపై నిరంతరం హోటల్, స్వీట్ హౌస్, టిఫిన్ సెంటర్, ఫాస్ట్ ఫుడ్, పానీపూరి బండ్లు లాంటి వాటిపై తనిఖీలు నిర్వహిస్తాం. యాజమానులు, నిర్వాహకులు శుచి, శుభ్రత, నాణ్యమైన వస్తువులే వాడాలి లేకపోతే చర్యలు తప్పవు. ఆకస్మిక దాడులు నిర్వహించి నాణ్యత శుభ్రత లేకుండా ఉంటే కఠిన చర్యలు తప్పవు.

-మహేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, మెదక్ మున్సిపాలిటీ

# హత్యాయత్నం కేసులో పలువురి అరెస్ట్

● నిందితుల్లో బీజేపీ నేతలు

సిద్దిపేట క్రైం, జూన్ 13: సిద్దిపేట పట్టణంలో వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులో పరారీలో ఉన్న నిందితులను పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సిద్దిపేట ఏసీపీ గురువారం వెల్లడించారు. పట్టణంలోని రాఘవేంద్ర నగర్‌లో రాజేష్ అనే వ్యక్తి సర్వే నంబర్ 1999లో ప్లాట్ కొనుగోలు చేసి మున్సిపల్ అధికారుల అనుమతితో ఇల్లు కట్టుకుంటుండగా, పత్రి శ్రీనివాస్, దుది శ్రీకాంత్‌రెడ్డిలు అది తమ భూమి అంటూ ఏవో కాగితాలు చూపిచి, గొడవపడ్డారు. అలాగే, మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపల్ అధికారులు పనులు నిలిపి వేయించగా, రాజేశ్ హైకోర్టుకు వెళ్లి తనకు అనుకూలంగా ఆర్డర్ తెచ్చుకుని, పనులు ప్రారంభించాడు. దీంతో పత్రి శ్రీనివాస్, దుది శ్రీకాంత్‌రెడ్డిలు స్థలం వద్దకు వచ్చి రాజేష్‌ను చంపుతామని బెదరించారు. అయినా, అలాగే నిర్మాణ పనులు చేస్తుండటంతో.. ఆ భూమిని ఎలాగైనా దక్కించుకోవాలని రాజేష్, అతనికి అండగా ఉన్న సతీష్, శ్రీనివాస్‌రెడ్డిలను చంపాలని నిర్ణయించుకుని సమయం కోసం వేచి చూశారు. ఈ ఏడాది ఏప్రిల్ 19న పత్రి శ్రీనివాసు, దూది శ్రీకాంత్ రెడ్డి, పాతూరు శ్రీనివాస్ రెడ్డి శివరాత్రి నగేష్, చేర్యాల అభిషేక్, అలకుంట ఆనంద్, పరశురాములు, యాదగిరి మొత్తం 11 మంది ప్లాన్ ప్రకారం అర్ధరాత్రి కొంపెల్లి నాగరాజుకు చెందిన ఎక్స్‌కవేటర్ తీసుకువచ్చి.. నిర్మాణంలో ఉన్న ఇంటిని కూల్చి వేశారు. సెంట్రింగ్ సామగ్రిని ధ్వంసం చేశారు. అలాగే, అక్కడే ఉన్న రెండు కార్లు, ఓ ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశారు. దీంతో రాజేశ్ మరుసటి రోజు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలుసుకున్న నిందితులు పారిపోయారు.

ఈ కేసులు నిందితులైన అలకుంట ఆనంద్, వల్లెపు పర్శరాములును ఈనెల 9న, 11న బొల్లవేణి యాదగిరిని అరెస్ట్ చేసి, జైలుకు పంపారు. గురువారం దుది శ్రీకాంత్ రెడ్డి, పత్రి శ్రీనివాస్, పాతూరి శ్రీనివాస్ రెడ్డి, శివరాత్రి నగేష్ చేర్యాల అభిషేక్‌లను అరెస్టు చేసి వారి నుంచి ఓ కారు, ఐదు సెల్‌ఫోన్లు, నేరానికి ఉపయోగించిన కర్రలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు ఏసీపీ తెలిపారు. మరో ముగ్గురు నిందితులు పత్రి నాగరాజు, నాగరాజు, కొంపల్లి నాగరాజు, బోదాసు కనకరాజు పరారీలో ఉన్నట్లు తెలిపారు. దూది శ్రీకాంత్ రెడ్డి గతంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. గతేడాది సిద్దిపేట బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. మరో నిందితుడు పత్రి శ్రీనివాస్ గతంలో సిద్దిపేట బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా పని చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న సిద్దిపేట ఏసీపీ మధు

# నియంతృత్వ పాలనతోనే మోదీకి వ్యతిరేక ఫలితాలు

● ప్రజాసమస్యల పరిష్కారంపై రేవంత్ దృష్టి పెట్టాలి

● ఆగస్టు 15లోగా రైతు రుణమాఫీ చేయాలి

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, జూన్ 13 : నియంతృత్వ పోకడలు అవలంభించడం వల్లే ఎన్నికల్లో మోదీకి వ్యతిరేక ఫలితాలు వచ్చాయని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డి అమరుల భవనంలో గురువారం నిర్వహించిన హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేండ్ల మోదీ పాలనలో కార్పొరేట్లకు కొమ్ము కాసి కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడ్డాడని ఆరోపించారు. ఎన్డీయే భాగస్వామ్య పక్షాల మద్దతు లేకపోతే ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఉండేది కాదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు ఆశలు పెట్టుకున్నారని, ఆయన ప్రజలకు దగ్గరగా ఉంటూ వారి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. రైతు రుణమాఫీని ఆగస్టు 15లోగా చేయాలన్నారు. భూముల సమస్యల పరిష్కారం కోసం సర్వే నంబర్ల వారీగా సమగ్ర సర్వే చేయాలని సూచించారు. వామపక్షాలకు బలహీన పరిస్థితి వచ్చిందని, ఎందుకు ఆ పరిస్థితి వస్తుందో ఆత్మ పరిశీలన చేసుకుంటామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, రాష్ట్ర సమితి సభ్యులు చాడ వెంకటరెడ్డి, జాగీర్ సత్యనారాయణ, ఎడల వనేష్, నాయకులు కనుకుంట్ల శంకర్, గంబీరపు మధుసూదన్, భాస్కర్, గోపి, పద్మ, సుదర్శన్, జేరిపోతుల జనార్థన్, జంగ విజయ, మల్లారెడ్డి, సంజీవరెడ్డి తదితరులున్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

### ఫోన్ ట్యాపింగ్ కేసు నుంచి తప్పించుకోవడానికే హరీశ్ బీజేపీలోకి..

● కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చక్రధర్ గౌడ్

తార్నాక, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసు నుంచి తప్పించుకోవడానికి మాజీ మంత్రి హరీశ్‌రావు బీజేపీలో చేరేందుకు యత్నిస్తున్నాడని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చక్రధర్ గౌడ్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తార్నాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చక్రధర్‌గౌడ్ మాట్లాడుతూ ఆగస్టు 15న రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవీకి రాజీనామా చేస్తానన్న హరీశ్‌రావు తన మాటకు కట్టుబడి ఉండాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే పదవీకి రాజీనామా చేయకుండా హరీశ్‌రావు ఇప్పటికే బీజేపీ జాతీయ నాయకులతో మంతనాలు జరుపుతున్నాడని, త్వరలో ఆయన బీజేపీలో చేరుతాడని తెలిపారు.

# సీఎంకు చిత్రపటం బహూకరణ

నారాయణఖేడ్, జూన్ 13: సిర్గాపూర్ మండలం కడ్పల్‌కు చెందిన బధిర (మూగ, చెవిటి) ఆర్టిస్ట్ గూడురి ఆగమప్ప.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పెన్సిల్‌తో గీసిన చిత్రాన్ని బహూకరించారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌తో కలిసి హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని గురువారం కలిసిన గూడురి ఆగమప్ప.. రేవంత్‌రెడ్డి తన మనవడిని ఎత్తుకుని ఉన్నట్లుగా పెన్సిల్‌తో గీసిన చిత్రాన్ని అందించారు. ఆగమప్పకు పుట్టుక నుంచి మూగ, చెవిటి లోపం ఉంది. అయినా చిత్రకళలో ముఖ్యంగా పెన్సిల్ ఆర్ట్‌లో మంచి ప్రావీణ్యం సంపాదించాడు. పలువురు ప్రముఖుల చిత్రాలను గీసి వారికి అందించారు. తాజాగా సీఎం చిత్రపటాన్ని గీసి బహూకరించారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్ ఉన్నారు. అయితే, ఆగమప్పకు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని ఎంపీ సురేష్ షెట్కార్ ఈ సందర్భంగా కోరారు.



సీఎం రేవంత్‌రెడ్డికి పెన్సిల్ ఆర్ట్‌తో వేసిన చిత్రాన్ని బహూకరిస్తున్న చిత్రకారుడు

# విద్యార్థులు కష్టపడి చదవాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

పెద్దశంకరంపేట, జూన్ 13: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని వీరోజిపల్లి తండా, పెద్దశంకరంపేటలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డితో కలిసి విద్యార్థులకు నోటు పుస్తకాలు, యూనిఫాంలను కలెక్టర్ అందజేశారు. పెద్ద శంకరంపేట పాఠశాలలో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇంటింటికీ తిరిగి బడీడు పిల్లలను బడిలో చేర్పించే విధంగా సర్వే చేశామన్నారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్య రంగానికి మొదటి ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా 6000 పాఠశాలలు మూతపడ్డాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాధాకిషన్, తహసీల్దార్ గ్రేస్‌బాయ్, ఎంపీడీవో రఫీక్‌ఉన్నీసా, ఎంఈవో బుచ్చానాయక్, ఎంపీపీ జంగం శ్రీనివాస్, నోడల్ అధికారి వెంకటేశం, రాజేశ్వర్‌రావు, విఠల్, ఎంపీటీసీలు వీణసుభాష్‌గౌడ్, రాజు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయిని మధు, సురేందర్‌రెడ్డి, నారాగౌడ్, అలుగుల సత్యనారాయణ, ఆర్ఎన్.సంతోష్‌కుమార్, దాచసంగమేశ్వర్, కుంట్ల రాములు, అంజిరెడ్డి, ఆయా గ్రామాల నాయకులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**మిషన్ భగీరథ పరిశీలన**

పెద్దశంకరంపేట, జూన్ 13: పెద్దశంకరంపేటలో మిషన్ భగీరథ సర్వే వివరాలను కలెక్టర్ రాహుల్ రాజ్ గురువారం పరిశీలించారు. ఇంటింటికీ మిషన్‌భగీరథ నీళ్లు వస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు.



బడిబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

**శాంతియుతంగా బక్రీద్ జరుపుకోవాలి**

మెదక్‌అర్బన్, జూన్ 13: రాబోయే బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ కోరారు. గురువారం కలెక్టరేట్‌లో సొసైటీ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ క్రూయాలిటీ టు ఎనిమల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ముస్లిం మతపెద్దలతో శాంతి సమావేశాలు నిర్వహించి, జంతు చట్టాల గురించి అవగాహన కల్పించాలన్నారు. జంతువుల నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.వెయ్యి జరిమానా లేదా మూడు నెలల జైలు శిక్ష విధిస్తారన్నారు. పశువుల అక్రమ రవాణాపై నిఘా పెట్టాలన్నారు. పోలీస్, వెటర్నరీ, రవాణా శాఖ అధికారులతో జిల్లాలోని తూప్రాన్ టోల్‌గేట్, నర్సాపూర్ చౌరస్తా, కోలపల్లిలో సమీకృత చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలన్నారు. అక్రమ రవాణాను నిరోధించాలన్నారు. పట్టుబడిన పశువులను దగ్గరలోని గోశాలలకు తరలించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి గుర్తించి ముందుగానే బైండోవర్ చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు. జిల్లాలో కుక్కలు, కోతుల బెడద నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మెదక్‌లో ఎనిమల్ బర్త్ కంట్రోలోను అతి త్వరలో ప్రారంభించాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, జిల్లా పశువైద్యాధికారి విజయశేఖర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# న్యాయం కోసం ఉపాధ్యాయుడి ధర్నా

సిద్దిపేట క్రైం, జూన్ 13 : మరొకరి తప్పుడు కుల ధ్రువీకరణ పత్రంతో తనకు అన్యాయం జరుగుతోందని ఓ ఉపాధ్యాయుడు సిద్దిపేట పాత డీఈవో కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. మర్కుక్ మండలం పాతూరు ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎస్టీటీ కూరాకుల శ్రీనివాస్ స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ ప్రమోషన్ లిస్ట్‌లో ఉన్నాడు. అయితే, ఎస్టీలు కాని వారిని ఎస్టీ జాబితాలో చేర్చి, వారికి ప్రాధాన్యం ఇవ్వడంతో తనకు అన్యాయం జరుగుతుందని అతని వాదన. తాము ఉద్యోగంలో చేరిన సమయంలో పలు కులాలకు చెందిన వారిని ఎస్టీలుగా పరిగణిస్తూ ఉద్యోగాలు ఇచ్చారని, 2014లో తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఎస్టీ జాబితా నుంచి పలు కులాలను ఎస్సీలుగా మారుస్తూ జీవో నంబర్ 11ను 2014 సెప్టెంబర్ 17న విడుదల చేసిందని గుర్తు చేశారు. అయితే, ఓ ఉపాధ్యాయుడు సదరు జీవోకు అనుగుణంగా తన సర్టిఫికెట్ మార్చుకోకుండా కేవలం ప్రమోషన్ కోసం ఎస్టీలోనే కొనసాగుతున్నాడని ఆరోపించారు. అధికారులు పరిశీలించి తనకు న్యాయం చేయాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.



ధర్నా చేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్

# సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



జగదేవ్‌పూర్‌లో మాట్లాడుతున్న డీఎల్పీవో లత

**వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను చైతన్యపరిచేందుకు గురువారం జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో గ్రామసభలు, ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఆయా గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తెలుసుకుని స్థానిక సిబ్బందికి తగిన సూచనలు చేశారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించారు.**

జగదేవ్‌పూర్, జూన్ 13: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టాలని జగదేవ్‌పూర్ మేజర్ గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి డీఎల్పీవో లత పేర్కొన్నారు. గురువారం జగదేవ్‌పూర్ గ్రామపంచాయతీ ఆవరణలో ప్రత్యేక అధికారి లత, కార్యదర్శి హరిప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామస్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. మురుగు కాలువల పరిసరాల్లో బ్లీచింగ్‌పౌడర్ చల్లాలని, తాగునీటి వాటర్‌ట్యాంకులను శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో ఎంపీటీసీ కవితాశ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచులు లక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి, కొంపెల్లి కరుణాకర్, మాజీ వార్డుసభ్యులు పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



మద్దూరు: సలాఖ్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో



మిరుదొడ్డి: మల్లుపల్లిలో మంచినీటి సరఫరాపై ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీడీవో

● **మద్దూరు:** మండలంలోని సలాఖ్‌పూర్‌లో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఎంపీడీవో రాంమోహన్ పాల్గొని మాట్లాడారు. నివాసాల పరిసరాల్లో నీరు నిలువకుండా జాగ్రత్తలు పాటించాలని, లేదంటే దోమల ద్వారా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. అదేవిధంగా మద్దూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై అధికారులు స్థానిక సిబ్బందితో పాటు గ్రామస్థులకు అవగాహన కల్పించారు. మురికి కాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలని, వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలని, దోమలు రాకుండా జాలీలు అమర్చుకోవాలన్నారు. గ్రామంలో మిషన్‌భగీరథ నల్లా కనెక్షన్లపై నిర్వహిస్తున్న సర్వేకు గ్రామస్థులు సహకరించాలని పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొప్పె కనకమ్మ, స్థానిక అధికారులు, గ్రామస్థులు, పాల్గొన్నారు.

● **మిరుదొడ్డి:** గ్రామాల్లో కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలను తీసుకోవాలని మిరుదొడ్డి ఎంపీడీవో గణేష్‌రెడ్డి సూచించారు. గురువారం మిరుదొడ్డి మండలం మల్లుపల్లి, రుద్రారం గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న మిషన్‌భగీరథ సర్వేను పర్యవేక్షించారు. గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాపై మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీవో జహీరొద్దిన్, పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

●**కుకునూరుపల్లి:** మండలంలోని పలు గ్రామాలలో గురువారం అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని వర్షాకాలంలో వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రజలకు సూచించారు. కుకునూరుపల్లిలో ఏర్పాటు చేసిన గ్రామసభకు ప్రత్యేక అధికారి నాగేందర్ హాజరయ్యారు. సభలో మురుగు కాల్వల నిర్వహణ, చెత్త సేకరణ, విద్యుత్ దీపాల ఏర్పాటు తదితర సమస్యలపై పలువురు గ్రామస్థులు, నాయకులు పంచాయతీ కార్యదర్శిని నిలదీశారు. ముఖ్యంగా గ్రామంలో చికెన్ సెంటర్ వ్యాపారులు వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేయడంతో వాటికోసం కుక్కలు చేరి పలువురిని గాయపరుస్తున్నాయని మండిపడ్డారు. సమస్యలపై స్పందించిన అధికారులు త్వరలో వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపివో వీర్రాజు, పీఎస్ఆర్ అధినేత నరేందర్, పలువురు అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



కుకునూరుపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి నాగేందర్

## ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించండి

హుస్నాబాద్, జూన్ 13 : వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అధికారులకు సూచించారు. గురువారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో జరిగిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతీ వార్డులో నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించాలని, ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. తాగునీటిని వృథా చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మురుగు కాల్వల్లో పూడికలు తీసి నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాన్నారు. వైద్య సిబ్బంది, అంగన్ వాడీ సిబ్బంది అందరూ కలిసికట్టుగా పని చేసి ప్రజలను సీజనల్ వ్యాధులపై అవగాహన పెంపొందేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ మల్లిఖార్జున్, మెడికల్ ఆఫీసర్ నిఖిత, కౌన్సిలర్లు స్వర్ణలత, చిత్తారి పద్మ, దొడ్డి శ్రీనివాస్, వల్లపు రాజు, హరీశ్, అయూబ్ తదితరులున్నారు.



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఆకుల రజిత

## షార్ట్‌సర్క్యూట్‌తో టిప్పర్ దగ్ధం

హుస్నాబాద్ రూరల్, జూన్ 13: మట్టి తరలిస్తున్న టిప్పర్ క్యాబిన్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి టిప్పర్ దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమదేవరపల్లి మండలంలోని ఓ చెరువులోని మట్టిని హుస్నాబాద్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లెలగడ్డ సమీపంలో టిప్పర్ క్యాబిన్‌లో నుంచి పొగ రావడంతో డ్రైవర్ వాహనాన్ని ఆపి కిందికి దిగాడు. అంతలోనే టిప్పర్ క్యాబిన్ నుంచి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. గ్రామస్థులు ఫైర్ ఇంజన్ సిబ్బందికి సమాచారం అందించడంతో ఫైర్‌ఇంజన్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది.



టిప్పర్ క్యాబిన్ నుంచి చెలరేగుతున్న మంటలు

## పుస్తెలతాడు దొంగలు అరెస్టు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ విజయ్‌కుమార్

ములుగు, జూన్ 13: ఈ నెల 12 ఉదయం తునికిబొల్లారం గ్రామశివారులో శ్యామల శంకరమ్మ అనే మహిళపై దాడి చేసి మెడలోని 5 తులాల పుస్తెల తాడును దొంగిలించిన ఘటనలో ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ములుగు ఎస్ఐ సీహెచ్ విజయ్‌కుమార్‌తో కలిసి ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు చుట్టుపక్కల సీసీటీవీ పుటేజీలను పరిశీలించి దుండగులు తున్కిబొల్లారం వైపు వెళ్లినట్లు గుర్తించారు. కాగా బుధవారం నిందితులు తాము దొంగిలించిన పుస్తెలతాడును తూప్రాన్‌లో గల జువెలరీషాపులో అమ్మేందుకు యత్నించగా, షాపు యజమాని అనుమానించి పోలీసులకు సమాచారమిచ్చాడు. తూప్రాన్ పోలీస్‌లు వెంటనే వారిని అదుపులోకి తీసుకుని విచారించి ములుగు పోలీసులకు సమాచారమిచ్చారు. గజ్వేల్ సీఐ ఆధ్వర్యంలో విచారణ జరపగా నిందితులు నేరాన్ని ఒప్పుకున్నారు. కాగా నిందితులు నింగని రజనీకాంత్(23), ఇరగళ్ల యాదగిరి(36) మేడ్చల్ జిల్లా మల్కాజ్‌గిరికి చెందినవారని తేలింది. వారు ఒంటరిగా ఉన్న మహిళల మెడలోని బంగారు గొలుసులు లాక్కొని వెళ్లేవారు. నిందితుల నుంచి బంగారు పుస్తెలతాడుతో పాటు వారి సెల్‌ఫోన్లు, సుత్తె, కారంపొడి ప్యాకెట్స్, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు రజనీకాంత్‌ను గతంలో ఓ హత్య కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. ప్రస్తుతం బెయిల్‌పై బయటకు వచ్చినట్లు తెలిపారు. గౌరారం సీఐ, ఎస్ఐలు కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించారు.

## ఇసుక లారీ పట్టివేత

గజ్వేల్, జూన్ 13: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న లారీని గజ్వేల్ పోలీసులు, సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లి శివారులోని రాజీవ్ రహదారి నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్నారని పోలీసులకు సమాచారమందింది. దీంతో గురువారం పోలీసులు దాడులు నిర్వహించి లారీని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు గజ్వేల్ సీఐ సైదా తెలిపారు.

## 'సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి'

కొండపాక, జూన్ 13 : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో పోలీసు కళా బృందం ప్రజలను చైతన్య పరిచేందుకు కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని తెలిపారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కళా బృందం సభ్యులు బాలు, రాజు, తిరుమల, తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు శ్యాంసుందర్, కనకయ్య, భిక్షపతి, హరిప్రసాద్, ప్రకాష్, శైలజ పాటల రూపంలో నాటకం రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు.

## 'బాల వికాస్' కార్యక్రమాలు ఆదర్శనీయం



మాట్లాడుతున్న వాటర్‌ప్లాంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు లింగమూర్తి

హుస్నాబాద్‌రూరల్, జూన్ 13: దేశ వ్యాప్తంగా బాలవికాస్ సంస్థ చేపడుతున్న స్వచ్ఛంద కార్యక్రమాలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నాయని వాటర్ ప్లాంట్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు కేడం లింగమూర్తి పేర్కొన్నారు. గురువారం మండలంలోని మాలపల్లి గ్రామంలో బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయనున్న సందర్భంగా నిర్వహించిన సమావేశంలోయన పాల్గొని మాట్లాడారు. బాలక్క బాలథెరిసాగా స్వచ్ఛంద కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజల సహకారంతో 75 శాతం సబ్సిడీతో దేశవ్యాప్తంగా 600 గ్రామాల్లో వాటర్ ప్లాంట్లను నెలకొల్పినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యం కోసం మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి తాగునీరందిస్తున్న బాలక్కకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సూచన మేరకు వాటర్‌ప్లాంట్ నిర్వహణ కోసం బోరువేయించి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో బాలవికాస సంస్థ మేనేజర్ మధుసూదన్‌రెడ్డి, కోఆర్డినేటర్ మోహన్‌రెడ్డి, ఫీల్డ్‌ఆఫీసర్ బాబు. సంస్థ ప్రతినిధులు వెన్న రాజు మాజీ సర్పంచులు బత్తుల రాజయ్య, మల్లయ్య తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు నగదు పురస్కారం

ధూళిమిట్ట,జూన్ 13: ఇటీవల పది పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన భైరాన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం నగదు పురస్కారాలను అందజేశారు. గ్రామానికి చెందిన దివంగత వంటేరు లింగారెడ్డి జ్ఞాపకార్థం కుమారుడు వంటేరు సిద్ధారెడ్డి రూ.10వేలు, దివంగత రామిని చంద్రయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రామిని వీరేశం రూ.11వేలు విద్యార్థుల కోసం అందజేసినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మీనాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 జీపీఏ సాధించిన ధరావత్ గణేష్‌కు పదివేలు, 9.7 జీపీఏ సాధించిన అభిరామ్‌కు ఐదువేలు,9.0 జీపీఏ సాధించిన మంజునాథ్, అఖిల, అంజలి ముగ్గురికి రెండు వేల చొప్పున నగదు పురస్కారాలను అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో అమ్మ అదర్శ కమిటీ చైర్‌పర్సన్లు సుజాత, రజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి'

చేర్యాల, జూన్ 13 : అనుమతులు పొందకుండా, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చేర్యాల పట్టణంలో కొనసాగుతున్న శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్ రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సదరు పాఠశాలలు అడ్మిషన్ల పేరిట అక్రమంగా రూ.2,500వసూలు చేస్తున్నారని, అంతేకాకుండా కామన్ సిలబస్ ఉన్నప్పటికీ తమ పాఠ్యపుస్తకాలు మాత్రమే కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖాధికారులు ప్రైవేటు పాఠశాలల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు తాడూరి భరత్‌కుమార్, తుమ్మ నరేశ్, శివ, అనిల్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎడ్ల గురువారెడ్డికి నివాళి

సిద్దిపేట అర్బన్, జూన్ 13: తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు సిద్దిపేట ప్రథమ శాసనసభ్యుడు ఎడ్ల గురువారెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా సిద్దిపేటలోని ఆయన విగ్రహానికి గురువారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ మంజులారాజనర్సు, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద పవన్, కంట్రోల్ కమిటీ సభ్యులు వెంకట్రాంరెడ్డి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఎడ్ల గురువారెడ్డి ఆశయ స్ఫూర్తితో పోరాటాలు కొనసాగిస్తామన్నారు.తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో గురువారెడ్డి పోరాటపటిమను గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.



గురువారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చాడ, నాయకులు

## నేడు జగదేవ్‌పూర్‌లో తైబజార్ వేలంపాట

జగదేవ్‌పూర్, జూన్ 13: ఈ నెల 14న శుక్రవారం జగదేవ్‌పూర్ మేజర్ గ్రామ పంచాయతీలో తైబజార్ వేలం నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి హరిప్రసాద్ తెలిపారు. గురువారం వేలంపాట నిర్వహించాల్సి ఉండగా అనివార్య కారణాల వలన వాయిదా పడిందన్నారు. పశువుల సంత, కూరగాయల మార్కెట్‌కు వేలంపాట నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గలవారు ముందస్తుగా డిపాజిట్ చేయాలన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు గ్రామ పంచాయతీ ఆవరణలో జరిగే వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

## నేడు మండల సర్వ సభ్య సమావేశం

నంగునూరు, జూన్ 13 : నంగునూరు మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ అరుణాదేవి అధ్యక్షతన ఈ నెల 14న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వేణుగోపాల్ తెలిపారు. సమావేశానికి సకాలంలో ప్రజా ప్రతినిధులు, పూర్తి సమాచారంతో మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

హుస్నాబాద్ రూరల్, జూన్ 13: మండలంలోని పొట్లపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులకు గురువారం వైస్ ఎంపీపీ దేవసాని నిర్మల చేతుల మీదుగా కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బంక చందు, మాజీ సర్పంచ్ గుర్తూరి చంద్రమౌళి, మార్క అనిల్, గాలిపెల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## 'మల్లన్న ఆలయం భూములను కాపాడాలి'

చేర్యాల, జూన్ 13 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ భూములు ఆక్రమణకు గురి కాకుండా దేవాదాయశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి అందె బీరయ్య పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్లన్న ఆలయాభివృద్ధి దృష్ట్యా గత ప్రభుత్వ హయాంలో భూములకు ఫెన్సింగ్ చేయించగా, ప్రస్తుతం పలువురు నాయకులు ఆ ఫెన్సింగ్‌ను కూల్చి కబ్జా చేసినా ఆలయాధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి ఆలయ భూముల పరిరక్షణ చేపట్టాలని కోరారు.

## 'వరి నారుమళ్లలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి'

నారాయణరావుపేట, జూన్ 13: వర్షాకాలంలో వరినారుమళ్లలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి వెంకట రమణి రైతులకు సూచించారు. గురువారం మండలంలోని గోపులాపూర్ గ్రామంలో రైతులకు వరినారుమళ్లపై క్షేత్రస్థాయిలో అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ అధిక దిగుబడి సాధించడంలో ఆరోగ్యవంతమైన నారుమడి కీలకమన్నారు. ఆరోగ్యంగాలేని నారును నాటడం వల్ల పంటకు చీడ పీడల బాధ అధికంగా ఉంటుందని వివరించారు. 5 సెంట్ల నారుమడికి 2కిలోల నత్రజని, 1 కిలో భాస్వరం, 1 కిలో పొటాష్ ఎరువులను దుక్కిలో వేయాలన్నారు. నారుమళ్లలో విత్తనం విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున వేయాలి. నారుతీయడానికి 7 రోజుల ముందు నారుమడికి 160 గ్రాములు కార్బోఫ్యూరాన్ గుళికలు తక్కువ నీటిలో వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో సంధ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆశాలకు పరీక్ష వద్దు

**సీఐటీయూ ఆధ్వర్యంలో సిద్దిపేటలో ఆశావర్కర్ల ధర్నా**




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

సిద్దిపేట అర్బన్, జూన్ 13: ఆశా వర్కర్లకు నష్టం కలిగించే ఎగ్జామ్ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు భాస్కర్ పేర్కొన్నారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ ఆశాలకు పరీక్షలు పెట్టి ప్రభుత్వం ఇచ్చే సర్టిఫికెట్‌తో ప్రయోజనమేమీ లేదని, ఏఎన్ఎం ప్రమోషన్ లాంటి సౌకర్యాలు అందులో కల్పించలేదన్నారు. ఆశా వర్కర్లకు పరీక్ష పెట్టే విధానాన్ని ఉపసంహరించుకొని వారికి కనీస వేతనాన్ని ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ప్రత్యేకంగా విధులు నిర్వహించిన ఆశా వర్కర్లకు డబ్బు చెల్లించాలన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్, ఆశా వర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు మంజుల, ప్రధాన కార్యదర్శి ప్రవీణ, నాయకులు శ్యామల, శారద, బాలమణి, మాలతి, కవిత, సుజాత, కవిత, వసంత, లక్ష్మి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడులు

● **జిల్లా ఆయిల్‌పామ్ ఇన్‌చార్జి అధికారి శంకర్**

అక్కన్నపేట, జూన్ 13: ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడులు వస్తాయని జిల్లా ఆయిల్‌పామ్ ఇన్‌చార్జి అధికారి శంకర్ పేర్కొన్నారు. గురువారం అక్కన్నపేట మండలం జనగామ గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పంట ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుంటుందని, చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని, పెట్టుబడి కంటే రెట్టింపు ఆదాయం వస్తుందని వివరించారు. ఎకరానికి 8 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి వస్తుందని, సుమారు రూ.లక్ష వరకు ఆదాయం వస్తుందని తెలిపారు. పామాయిల్ పంటలో మూడేళ్లపాటు ఇతర అంతర పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. కూరగాయలు, మొక్కజొన్న, పత్తి, కంది, అరటి, బొప్పాయి సాగు చేసుకోవచ్చని తెలిపారు. మూడున్నరేళ్లకు పంట దిగుబడి ప్రారంభమై, 30 ఏళ్ల వరకు దిగుబడి నిస్తుందని, నీటివసతి ఉన్న ప్రతీ రైతు పంటను సాగు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగరాజు, ఏఈవో శ్రీలత, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ రవళి, మొక్కల పర్యవేక్షణ అధికారి విజయ్, తదితరులు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ సదస్సులో మాట్లాడుతున్న అధికారి శంకర్

# గ్రామాభివృద్ధికి నిధుల్లేవ్.. నిర్వహణ ఎలా?

● **ఎంపీడీవోకు మండల కార్యదర్శుల వినతి**



ఎంపీడీవో రాఘవేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

సిద్దిపేట రూరల్, జూన్ 13: గ్రామ పంచాయతీల్లో నిధులు లేని కారణంగా నిర్వహణ భారం అవుతుందని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సిద్దిపేట రూరల్ మండలం పంచాయతీ కార్యదర్శులు నిధులు మంజూరు చేయించాలని ఎంపీడీవో రాఘవేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో కొన్ని నెలలుగా రాష్ట్ర ఆర్థిక సంఘం, కేంద్ర ఆర్థిక సంఘం నిధులు రావడం లేదని తెలిపారు. దీంతో గ్రామ పంచాయతీల్లో సిబ్బంది జీతాలు చెల్లించలేక, పారిశుధ్యం పనులు, ఇతర నిర్వహణ పనులకు అప్పులు చేసి గ్రామ పంచాయతీల పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గ్రామాల్లో చేపట్టిన సర్వేలకు గ్రామంలోని గ్రామస్థాయి అధికారులు ఎవరూ సహకరించడంలేదన్నారు. గత సర్పంచులు చేసిన పనులకు బిల్లులు ఇప్పించాలని తమపై ఒత్తిడి తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు విడుదల చేయించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రమాదేవి, జీవన్ రెడ్డి, యాదగిరి, మమత తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేటలో ఘనంగా కృష్ణాలయ వార్షికోత్సవం

సిద్దిపేట అర్బన్, జూన్ 13: సిద్దిపేటలోని కృష్ణాలయం 31వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి క్షీరాభిషేకం, పుష్పాభిషేకం, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అంతకు ముందు ఆలయంలో బచ్చు రమేష్ ఆలపించిన భక్తి గీతాలు శ్రోతలను మైమరిపింపజేశాయి. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షురాలు విజయ, వైస్ ప్రెసిడెంట్ అయిత కేదరినాథ్, సెక్రటరీ బచ్చు రమేష్, సిద్దిపేట మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ బచ్చు సుజాత రమేష్, సభ్యులు పాల్గొన్నారు.



పూజాకార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు



దీపాదాస్‌మున్షీకి పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న నాగపురి

## టీపీసీసీ ఇన్‌చార్జిని కలిసిన నాగపురి

చేర్యాల, జూన్ 13 : కాంగ్రెస్‌పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని చేర్యాలకు చెందిన టీపీసీసీ నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డితో కలిసి వెళ్లి అభినందనలు తెలిపారు.

# గజ్వేల్ సమీకృత మార్కెట్‌ను పరిశీలించిన మార్కెటింగ్ డైరెక్టర్



గజ్వేల్‌లోని సమీకృత మార్కెట్‌ను పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి

గజ్వేల్, జూన్ 13: గజ్వేల్ సమీకృత మార్కెట్‌ను తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి పరిశీలించారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఇటీవల రాష్ట్రమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలసి సమీకృత మార్కెట్‌లో మడిగెల నిర్మాణం, తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు తదితర సమస్యలపై వివరించి, ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. మంత్రి ఆదేశాల మేరకు డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ లక్ష్మీబాయి గజ్వేల్ సమీకృత మార్కెట్‌ను పరిశీలించి తాత్కాలిక బస్టాండ్, మడిగెల నిర్మాణానికి సంబంధించిన అంశాలను పరిశీలించారు. ఈ విషయంపై గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ ఆమెకు వివరించారు. వారితో ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ పద్మహర్ష, డిప్యూటీ ఈఈ మహేందర్, సిద్దిపేట జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి నాగరాజు, గజ్వేల్ మార్కెట్ కార్యదర్శి జాన్‌వెస్లీ, నాయకులు వంటేరు నరేందర్‌రెడ్డి, సుభాష్ చంద్రబోస్, సమీర్, సర్దార్ ఖాన్, సయ్యద్ మతీన్, వహీద్, యాదగిరి, జంగం రమేశ్‌గౌడ్, రామచంద్రాచారి, కేశిరెడ్డి రవిందర్‌రెడ్డి, కుంట్ల లక్ష్మారెడ్డి, దయ్యాల యాదగిరి తదితరులున్నారు.

## పాడిరైతులను విస్మరిస్తున్న ప్రభుత్వం




ధర్మారంలో నిరసన వ్యక్తం చేస్తున్న పాడిరైతులు

మిరుదొడ్డి, జూన్ 13: రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులను పూర్తిగా విస్మరించిందని పాడిరైతులు నర్సింహారెడ్డి, శ్రీకాంత్, రాజులు విమర్శించారు. గురువారం మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో విజయపాల డెయిరీ ఎదుట పాల బిల్లులను సకాలంలో చెల్లించడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గతంలో 15రోజులకు ఒకసారి పాల బిల్లులు వచ్చేవని, ఇప్పుడు రెండు నెలలు గడిచినా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పశుపోషణకు ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు.

## ఆస్పత్రుల్లో సౌకర్యాలను కల్పించండి



మంత్రికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక, జూన్ 13: రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను గురువారం హైదరాబాద్ సచివాలయంలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దుబ్బాక నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో, పీహెచ్‌సీ సెంటర్లలో సౌకర్యాలను కల్పించడంతో పాటు సిబ్బందిని నియమించాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.మంత్రిని కలిసినవారిలో కాంగ్రెస్ నాయకులు చెరుకు విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్, కాల్వ నరేష్, శ్రీనివాస్‌గౌడ్, కిషన్, చంద్రకాంత్ తదితరులున్నారు.

## విద్యకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

దౌల్తాబాద్, జూన్ 13: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల విద్యకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తూ పెద్దపీట వేస్తుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పడాల రాములు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని దౌల్తాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పడాల రాములు మాట్లాడుతూ. పాఠశాలలు పునః ప్రారంభంలోనే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పాఠపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండారు లాలు, దౌల్తాబాద్ మాజీ సర్పంచ్ ఆది వేణుగోపాల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.